క్లుప్తంగా

ఎడతెరిపి లేని వర్షం



భీమనపల్లిలో నీట మునిగిన రహదారి

ఉప్పలగుప్తం: అల్పపీడనం ప్రభావంతో మండలంలోని భీమనపల్లి, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం, చల్లపల్లి, మునిపల్లి తదితర గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. పల్లపు ప్రాంతాలు, కాలనీలు వర్షం నీటితో జలమయమయ్యాయి. ప్రధాన రహదారులు ముంపుబారిన పడడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. వర్షాల కారణంగా విద్యుత్ వైర్లపై చెట్లు, ఆకులు పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలకు తిప్పలు తప్పలేదు.

దివ్యాంగుల పింఛన్ పెంపు

యానాం: దివ్యాంగులకు పింఛన్‌గా ప్రస్తుతం ఇస్తున్న మొత్తానికి అదనంగా మరో రూ.1,000 పెంచుతున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు బుధవారం ప్రకటించారు. దీని ప్రకారం రూ.2,000 పొందుతున్న వారికి రూ.3,000, రూ.2,500 పొందుతున్నవారికి రూ.3,500, రూ.2,700 తీసుకుంటున్నవారికి రూ.3,700, రూ.3,500 అదుకుంటున్నవారికి రూ.4,500 ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కొత్తగా నమోదు చేసుకున్న 175 మందికి సైతం ఈ మొత్తం అందిస్తామని వెల్లడించారు. పింఛన్ల పెంపు వల్ల ప్రభుత్వానికి నెలకు రూ.2,13,29,000 అదనంగా ఖర్చవుతుందన్నారు.

కాలం చెల్లిన మందుల పంపిణీపై చర్యలు తీసుకోవాలి

యానాం: యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో గడువు తీరిన కాలం చెల్లిన మందులను రోగులకు పంపిణీ చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎల్జీ కైలాష్‌నాథన్‌కు ఫిర్యాదు చేసినట్లు స్థానిక సోషల్ యాక్టివిస్టు పెద్దిరెడ్డి బాబి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యం కోసం వచ్చిన బాలుడికి గడువు తీరిన సిరప్ మందును ఇవ్వడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడని దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. ముఖ్యంగా ఫార్మసీ విభాగాన్ని ప్రక్షాళన చేసి అర్హత కలిగిన వారిని నియమించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బ్లోఅవుట్ బాధితులకు నష్ట పరిహారంపై హామీ

కాట్రేనికోన: 'బ్లో అవుట్' కారణంగా నష్టపోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించేందుకు కృషి చేస్తామని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ హామీ ఇచ్చినట్టు అమలాపురం ఎంపీ హరీష్ తెలిపారు. మండలంలోని ఉప్పూడి గ్రామంలో గతంలో జరిగిన 'బ్లో అవుట్' కారణంగా నష్టపోయిన తమకు ఇప్పటివరకూ నష్టపరిహారం చెల్లించలేదంటూ ఇటీవలి కాలంలో ఉప్పూడి గ్రామస్తులు ఆందోళన చేశారు. ఓఎన్జీసీ అధికారులు హామీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా నష్ట పరిహారం చెల్లించలేదన్న విషయాన్ని బాధితులు అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీని కలిసి ఎంపీ హరీష్ బాలయోగి పరిస్థితిని వివరించారు. సానుకూలంగా స్పందించిన పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి త్వరలోనే ఉప్పూడి గ్రామస్తులకు నష్ట పరిహారం చెల్లించేందుకు తాను ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చినట్లు హరీష్ బాలయోగి విలేకర్లకు బుధవారం చెప్పారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



మురమళ్లలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

ఐ.పోలవరం: పల్లెలో మౌలిక సదుపాయల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలో కేశనకుర్రు, తిల్లకుప్ప, ఐ.పోలవరం, టి.కొత్తపల్లి, కొమరగిరి, పశువుల్లంక, మురమళ్ల, ఎదుర్లంక, గుత్తెనదీవి, జి.వేమవరం, జి.మూలపొలం, భైరవపాలెం గ్రామాల్లోని 46 ప్రాంతాల్లో రూ.4.26 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, సర్పంచ్ కాశే రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

వెంకటరమణ	- స్వాగ్
శ్రీలలిత	- జనక అయితే గనక
శేఖర్-1	- విశ్వం
శేఖర్-2	- మా నాన్న సూపర్ హీరో
రమా	- దేవర
వీపీసీ-1	- వేట్టయాన్
వీపీసీ-2	- మార్టిన్

వదలని వాయు'గండం'

- కుండపోత వర్షాలతో కాలువల్లా రహదారులు
- ఎక్కడినీరు అక్కడే నిలిచిపోయి ప్రజలకు అవస్థలు

తాళ్లరేవు: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రహదారులు కాలువలను తలపిస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు చిన్నపాటి వర్షానికే ముంపుబారిన పడి చెరువులను తలపిస్తున్నాయి. చాలా గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోతోంది. దీంతో ముంపునీరు దిగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాయుగుండం ప్రభావంతో మరో రెండురోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తుండడంతో అటు ప్రజలు, ఇటు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెరువులను తలపిస్తున్న రహదారులు

తాళ్లరేవు మండలంలోని పి.మల్లవరం, జార్జిపేట, నీలపల్లి, సుంకరపాలెం, ఇంజరం, గాడిమొగ తదితర పంచాయతీల్లోని పలు రహదారులు చిన్నపాటి వర్షానికే ముంపుబారిన పడుతున్నాయి. ముఖ్యంగా యానాం-కాకినాడ రహదారిలోని కోరంగి పంచాయతీ సీతారామపురం ప్రధాన రహదారి వర్షం వచ్చిందంటే చాలు చెరువును తలపిస్తోంది. అలాగే యానాం-ద్రాక్షారామ రహదారిలోని సుంకరపాలెం రహదారి, తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్, మాధవరాయునిపేట, పరదేశమ్మ వీధి, నీలపల్లి చెక్‌పోస్టు సెంటర్, జమ్మిచెట్టు సెంటర్ తదితర రహదారులు పదే పదే ముంపుబారిన పడుతున్నాయి. ముంపు నీటిలోనే వాహనదారులు, పాదచారులు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటుంది. రహదారి చెంతన వ్యాపార సముదాయాలు ఉండడంతో మురుగునీటితో అనేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడల్లా వ్యాపారాలు సాగడం లేదని వాపోతున్నారు. చాలా గ్రామాల్లో డ్రెయినేజీలు లేకపోవడం, ఉన్న డ్రెయినేజీలు పూడుకుపోవడంతో మురుగునీరు అక్కడే నిలిచిపోతుంది. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు పెరిగిపోయి డెంగీ, మలేరియా తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయేమోనని జనం బెంబేలెత్తిపోతున్నారు. అధికారులు సిమెంట్ రహదారులపై చూపే శ్రద్ధ డ్రెయినేజీలపై చూపడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరచాలని, అలాగే ప్రధాన రహదారుల్లో మురుగు నీరు పోయేలా చర్యలు చేపట్టాలని సర్వత్రా కోరుతున్నారు.



చెరువును తలపిస్తోన్న కోరంగి పంచాయతీ సీతారామపురం ప్రధాన రహదారి

> **వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు**
>
> వర్షాల కారణంగా రహదారులపై నీరు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలతో పాటు రహదారి చెంతన ఉన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా భారీ వర్షాలు కురిసినప్పుడు డ్రైనేజీలు పూడుకుపోయి రహదారులు చెరువుల్లా మారుతున్నాయి. రహదారిపై భారీ వాహనాలు వెళ్లినపుడు నీరు దుకాణాల్లోకి వచ్చేస్తుండడంతో అనేక ఇక్కట్లు పడుతున్నాం. మురుగునీటిలో జనం రాకపోవడంతో వ్యాపారులు నష్టపోతున్నారు.
>
> – అడబాల శివ, టీ దుకాణదారుడు



వర్షానికి పంట కాలువలా మారిన పరదేశమ్మ వీధి రహదారి



నీలపల్లి చెక్‌పోస్టు సెంటర్‌లో మునిగిన ప్రధాన రహదారి



తాళ్లరేవులో ముంపు నీటిలో నడిచి వెళుతున్న పాదచారి

మానసిక క్రమశిక్షణ జీవన విధానం అవసరం



మానసిక ఆరోగ్యంపై వివరిస్తున్న జిప్‌మెర్ సిబ్బంది

యానాం: ప్రతి ఒక్కరూ మానసిక క్రమశిక్షణ జీవన విధానం అలవర్చుకోవాలని యానాం జిప్‌మెర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆనందరాజు పేర్కొన్నారు. అక్టోబర్ 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకూ ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటుచేసిన ఆరోగ్య కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 20 శాతం మంది ప్రజలు అంటే ప్రతి పదిమందిలో ఇద్దరు మానసిక రుగ్మతలు, సమస్యలతో బాధపడుతున్నారన్నారు. ఈ సమస్య 15-30 ఏళ్ల మధ్యలోపు వారు ఎక్కువగా ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో కోపం, నిద్రలేమి, టెన్షన్, ఒంటరిగా ఉండటం, మాదకద్రవ్యాలు, ఆల్కహాల్ తదితర దుర్వ్యసనాలకు లోనవుతున్నారన్నారు. ఈ సందర్భంగా మానసిక ఆరోగ్యంపై ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

21 నుంచి రేషన్ దుకాణాలు ప్రారంభం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలోనూ ఈ నెల 21వ తేదీ నుంచి రేషన్ దుకాణాలు ప్రారంభిస్తున్నామని సీఎం రంగసామి బుధవారం ప్రకటించారు. వాటి ద్వారా బియ్యం, పంచదార ఉచితంగా పంపిణీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ ప్రణాళిక అమలుకోసం ఇప్పటికే సివిల్ సప్లయిస్ శాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

అర్హులైన కూలీలకు జాబ్‌కార్డులు జారీ చేయాలి

అల్లవరం: తెలుపు రంగు రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు జాబ్ కార్డులు జారీ చేసి ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కల్పించాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరంలో ఉపాధి కార్యాలయంలో బుధవారం ఉపాధి కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి కార్డు కలిగిన కుటుంబాలకు 100 రోజుల పని కల్పించాలన్నారు. గ్రామాల్లో కొత్త పనులు గుర్తించి తద్వారా కూలీలకు ఉపాధిని అందించాలన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన సీసీ రోడ్లు, డ్రైన్ నిర్మాణ ప్రాంతంలో ప్రజలకు తెలిసేలా నేమ్ బోర్డులు పెట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ నాగేంద్ర, ఏపీఓ శ్రీనుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

ప్రీ పెయిడ్ మీటర్లు బిగించడం సరికాదు

- విద్యుత్ శాఖ ఎస్ఈ రాజబాబుకు కోకో ఫెడ్ వినతి

అమలాపురం టౌన్: స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రీ పెయిడ్ మీటర్లు బిగించడం సరికాదని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) రాజబాబుకు కోనసీమ కన్జ్యూమర్స్ ఫెడరేషన్(కోకో ఫెడ్) చైర్మన్ అరిగెల బలరామమూర్తి సూచించారు. ఇలా బిగించడం వినియోగదారుల హక్కులను హరించడమేనని స్పష్టం చేశారు. స్థానిక ఈదరపల్లిలోని విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయానికి కోకో ఫెడ్ ప్రతినిధుల బృందం బుధవారం వెళ్లి వినియోగదారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఎస్ఈతో చర్చించింది. ఎలక్ట్రిక్ రెగ్యులేటరీ కమిషన్ ఏ విధమైన పబ్లిక్ హియరింగ్ నిర్వహించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని కోకోఫెడ్ ప్రతనిధులు నిరసన వ్యక్తం చేశారు. కోనసీమలో తరచూ అనివార్యమవుతున్న విద్యుత్ కోతలు, లోఓల్టేజీ సమస్యను కూడా పరిష్కరించాలని కోరారు. ఎస్ఈని కలిసిన వారిలో కోకో ఫెడ్ కార్యదర్శి ఆదిత్య కిరణ్, ప్రతినిధులు బీవీవీ సత్యనారాయణ తదితరులున్నారు.



విద్యుత్‌శాఖ ఎస్ఈ రాజబాబుకు విద్యుత్ సమస్యలను వివరిస్తున్న కోకో ఫెడ్ ప్రతినిధుల బృందం

దేవుడితో ఆటలాడతారా?

- మూడు రోజుల క్రితం వినాయక ఆలయం కూల్చివేసిన మున్సిపల్ సిబ్బంది
- టీడీపీ నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి సిఫారసులే కారణం
- మళ్లీ అదే స్థానంలో ఆలయాన్ని ప్రారంభించిన మంత్రి సుభాష్

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన బాల విద్యార్థి గణపతి సంఘం సభ్యులు అమలాపురంలోని దుడ్డివారి అగ్రహారంలో ఓ ప్రైవేట్ స్థలంలో వినాయకుడి ఆలయాన్ని తాత్కాలికంగా నిర్మించారు. అయితే ఆ స్థలం మున్సిపాలిటీది కాకపోయినా సోమవారం అర్ధరాత్రి మున్సిపాలిటీ సిబ్బంది ఆలయాన్ని కూల్చివేసి విగ్రహాన్ని తీసుకెళ్లిపోయారు. అయితే విషయమేంటని ఆరా తీస్తే టీడీపీకి చెందిన ఓ మండల స్థాయి మాజీ ప్రజాప్రతినిధి ఒత్తిడితో నియోజకవర్గ ప్రజాప్రజాప్రతినిధి సిఫారసుల కారణంగానే మున్సిపాలిటీ సిబ్బంది ఆలయ కూల్చివేతకు పాల్పడినట్లు తెలుస్తుంది.

ట్విస్ట్ ఏంటంటే

ఆలయాన్ని కూల్చివేసిన మున్సిపాలిటీ సిబ్బంది తీరుపై మండిపడిన బాల విద్యార్థి గణపతి సంఘం ప్రతినిధులు అదే స్థలంలో మంగళవారం మరో తాత్కాలిక ఆలయాన్ని నిర్మించి ఓ కొత్త వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ట్విస్ట్ ఏంటంటే ఆ ఆలయాన్ని ప్రారంభించడానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హాజరు కావడంతో తెలుగు తమ్ముళ్లంతా గొల్లుమన్నారు. స్థానికంగా కూటమి నేతల మధ్య సఖ్యత లేదనడానికి ఈ సంఘటన ఓ ఉదాహరణగా నిలిచింది. దీంతో అమలాపురానికి సంబంధించి టీడీపీలో జరుగుతున్న వర్గపోరుపై జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చోపచర్చలు ప్రారంభమయ్యాయి. ఒకపక్క అమలాపురం నియోజకవర్గానికి చెందిన ఓ కీలక ప్రజాప్రతినిధి అంతా తన కనుసన్నల్లోనే సాగాలని భావిస్తుంటే మంత్రి సుభాష్ దానికి చెక్ పెట్టే ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలుస్తుంది. అమలాపురం పట్టణంలో సీఐ నియామకంలో సైతం ఇరువర్గాలు పోటీపడడంతో వివాదం తారస్థాయికి చేరుకున్నట్లుగా టీడీపీ వర్గాల నుంచే వినిపిస్తుంది. అయితే ఇతరత్రా అంశాల్లో ఎలా ఉన్నా వీళ్లింతేనని సరిపెట్టుకోవచ్చని, కాని వారిద్దరి ఆధిపత్య పోరు కోసం దేవుడితో ఆటలేంటని ప్రజలు మండిపడుతున్నారు.

కూల్చేయాల్సిన పనేమిటి?

వాస్తవానికి అక్కడ ఏదైనా అక్రమమంటూ ఉంటే ముందుగా స్థల యజమానికి నోటీసులు జారీచేసి అప్పుడు కూల్చివేతకు దిగాలి. కాని అదేమీ లేకుండా రాత్రికిరాత్రి ఆలయాన్ని కూల్చేయడం వివాదానికి దారి తీసింది. ఆలయం కూల్చివేతపై బాల విద్యార్థి గణపతి సంఘం ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి అధికారులను నిలదీశారు. ఆలయం నిర్మించిన స్థలం మున్సిపాలిటీది కానప్పుడు మున్సిపాలిటీ అత్యుత్సాహం ప్రదర్శించి ఆలయాన్ని కూల్చివేసి వినాయక విగ్రహాన్ని తీసుకెళ్లాల్సిన పనేమిటని ప్రశ్నించారు. రాజకీయ ఒత్తిడితో ఈ చర్యలకు పాల్పడ్డారా అని ప్రశ్నించడంతో మున్సిపల్ సిబ్బంది సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. ఈ ఘటనలో రెండు వైపులా టీడీపీ నాయకులే ఉండడంతో ఎటు మొగ్గుచూపాలో అర్థం కాక మున్సిపల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఆలయం నిర్మించిన స్థలంపై ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో ఇలా స్పందించాల్సి వచ్చిందని చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయితే బాల విద్యార్థి గణపతి సంఘం ప్రతినిధులు మాత్రం మున్సిపాలిటీ ఓవర్ యాక్షన్‌పై న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నారు.



రాజకీయ ఒత్తిళ్లతో మున్సిపాలిటీ సిబ్బంది కూల్చివేసిన గణపతి తాత్కాలిక ఆలయం



కూల్చివేసిన స్థానంలో మళ్లీ నిర్మించిన ఆలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

అంబరాన్నంటిన శ్రీదేవి నిమజ్జన సంబరాలు

- ఊరేగింపులో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్ర దసరా మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముగింపు రోజు సందర్భంగా అమ్మవారి నిమజ్జన ఊరేగింపు పురవీధుల్లో వైభవంగా సాగింది. నిమజ్జనోత్సవ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఊరేగింపులో రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 9 రకాల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 250 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో అలరించారు. మంగళగిరి నుంచి వచ్చిన ఆట గుర్రాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. విజయవాడకు చెందిన 40 మంది కళాకారులతో భూత, భేతాళ సెట్‌లు, ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కేరళ వాయిద్యాలు, గిరజన థింసా నృత్యాలు, డప్పుల డ్యాన్స్‌లు, మురళీ కోలాటాలు, శక్తి వేషాలు ఒక దానికొకటి పోటీ పడుతూ ప్రదర్శనలు సాగాయి.

వర్షం కురుస్తున్నా ఆగని ఊరేగింపు

అమలాపురంలో వర్షం కురుస్తున్నా నిమజ్జన ఊరేగింపు, ప్రదర్శనలు నిరాటంకంగా సాగాయి. శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు నిమజ్జన ఊరేగింపును ప్రారంభించారు. తొలుత అమ్మవారికి కలశ స్థాపన జరిగింది. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఊరేగింపులను వీక్షించే ప్రజలకు, ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులకు సేవలందించారు. అమ్మవారి ఆలయం నుంచి ముస్లిం స్ట్రీట్, హైస్కూలు రోడ్డు, గడియారం స్తంభం సెంటరు, ముమ్మిడివరం గేట్ సెంటరు, నల్లవంతెన రోడ్డు మీదుగా ప్రధాన పంట కాల్వ వరకూ ఊరేగింపు సాగింది. బుధవారం రాత్రి పొద్దుపోయాక అమ్మవారి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో పట్టణ ఎస్ఐలు కిషోర్‌బాబు, పృథ్వీ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు.




శ్రీదేవి నిమజ్జన ఊరేగింపులో థింసా నృత్యం



శక్తి వేషాల ప్రదర్శనలు



కేరళ వాయిద్యాలు



ఊరేగింపులో శ్రీదేవి అమ్మవారి వాహనం



ఆకట్టుకున్న కోయ డ్యాన్స్ బృందం

పరిష్కారం కాని గ్యాస్ పైపులైన్ వివాదం



పోలేకుర్రు గ్యాస్ ట్యాపింగ్ యూనిట్ సమస్యపై, పీఐఎల్ ప్రతినిధులు, గ్రామస్తులతో చర్చలు జరుపుతున్న తహసీల్దార్ త్రినాథరావు

- సమావేశానికి హాజరుకాని రిలయన్స్ అధికారులు
- అసంపూర్తిగా ముగిసిన చర్చలు

తాళ్లరేవు: పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవు గ్రామంలో జాతీయ రహదారి 216ని ఆనుకుని నిర్మిస్తున్న గ్యాస్ ట్యాపింగ్ యూనిట్ నిర్మాణంపై నెలకొన్న వివాదం పరిష్కారం కాలేదు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి రిలయన్స్ అధికారులెవరూ హాజరుకాకపోవడంతో చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. తహసీల్దార్ పితాని త్రినాథరావు పైపులైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్(పీఐఎల్) ప్రతినిధులు, పోలేకుర్రు గ్రామ నాయకులు, ప్రజలతో చర్చించారు. ఈ సందర్భంగా పీఐఎల్ ప్రతినిధి ప్రకాష్ మాట్లాడుతూ రిలయన్స్ గ్యాస్‌ను కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో ఇంటింటికీ పైపులైన్ ద్వారా సరఫరా చేసేందుకు గానూ ఈ ట్యాపింగ్ యూనిట్‌ను నిర్మిస్తున్నామన్నారు. దీనికి సంబంధించి గ్రామస్తుల డిమాండ్లకు అనుగుణంగా చర్యలు చేపడతామన్నారు. అయితే గ్యాస్ సరఫరా చేసే రిలయన్స్ సంస్థ ప్రతినిధులు దానికి సంబంధించి చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. దీంతో రిలయన్స్ ప్రతినిధులు లేకుండా మీరెలా వచ్చారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రిలయన్స్ చమురు సంస్థ కారణంగా పోలేకుర్రు గ్రామ పంచాయతీకి తీవ్ర నష్టం కలుగుతుందని, తమ పంచాయతీ నుంచే కంపెనీకి తాగు నీరు సరఫరా అవుతుందని, కంపెనీ కాలుష్యం అధికమొత్తం తమ గ్రామంపైనే ఉంటుందని గ్రామ సర్పంచ్ వెంటపల్లి నూకరాజు తెలిపారు. అయితే కంపెనీ ఉన్న గాడిమొగ పంచాయతీకి, ఎటువంటి సంబంధం లేని యానాంకు సహాయం అందిస్తున్నారు తప్ప తమ పంచాయతీకి ఎటువంటి సహకారం అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనావాసాల మధ్య నిర్మిస్తున్న ఈ గ్యాస్ పైపులైన్, ట్యాపింగ్ యూనిట్‌ల కారణంగా ఏదైనా ప్రమాదం సంభవిస్తే భారీ ఆస్తి, ప్రాణ నష్టం చవిచూడాల్సి వస్తుందని దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. రిలయన్స్ ప్రతినిధులతో కలిసి వీలైనంత త్వరగా సమావేశం ఏర్పాటు చేసి తమ డిమాండ్లను పరిష్కరించాలన్నారు. లేదంటే తీవ్రస్థాయిలో ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబు, పీఐఎల్ ప్రతినిధులు ఖాజీవల్లీ, త్రినాథరావు, ధర్మారావు, హర్యానా సిటీ గ్యాస్ ప్రతినిధి రాధాకృష్ణ, నాయకులు జక్కల ప్రసాద్, నిమ్మకాయల మూర్తి, వడ్లమూరి సతీష్, దడాల బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.